అన్నదాత సుఖీభవ పథకమెప్పుడో

- మండలంలో రబీ ఆరంభం.. రైతులకు గడ్డుకాలం
- పెట్టుబడి సాయం ఊసెత్తని సర్కారు
- 25 శాతానికి సబ్సిడీ శనగ విత్తనాలు కుదింపు



సింహాద్రిపురంలో ఎండుదశకు చేరుకుంటున్న సోయాబీన్ పంట

సింహాద్రిపురం : ఖరీఫ్ అయిపోయింది.. రబీ వచ్చింది.. సర్కారు మాత్రం వ్యవసాయానికి పైసా కూడా విదల్చలేదు. ఎన్నికల ముందు చంద్రబాబు రైతులకు వరాల జల్లు కురిపించారు. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి దాటవేస్తూ వస్తోంది. గత ప్రభుత్వం అమలుచేసిన రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవ పథకమంటూ పేరు మార్చి సరిపెట్టుకుంది. ఆ తరువాత అదిగో.. ఇదిగో అంటూ వ్యవసాయం ఊసెత్తలేదు. ఖరీఫ్ సీజన్ వెళ్లిపోయి.. రబీ కూడా వచ్చేసింది. రబీలో ప్రధాన పంట బుడ్డశనగ పంట. ప్రభుత్వం అందించి సబ్సిడీ 50 శాతం నుంచి 25 శాతం కుదించిన కూటమి ప్రభుత్వం కేవలం అన్నదాత సుఖీభవ పథకం కాస్త అన్నదాత దుఃఖీభవగా మారుతోంది.

తగ్గిన పంటల సాగు విస్తీర్ణం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా రైతులకు చిల్లిగవ్వ విదల్చలేదు ఈ ఖరీఫ్ మండల వ్యాప్తంగా 1602 హెక్టార్లలో వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఇతర పంటలు సాగు చేయాల్సి ఉంది. ఈ పంటలకు పెట్టుబడి ఎక్కువ కావాల్సి వస్తుందని. కానీ కూటమి ప్రభుత్వం రైతులను దగా చేయడంతో కేవలం 1469 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగులో ఉన్నాయి. కంది సోయాబీన్ ఇతర పంటలను రైతులు సాగు చేశారు. ఈ పంటలకు కూడా వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గి రైతులు నష్టాలు చవి చూడాల్సి వచ్చింది. ఇప్పుడు రబీ ప్రారంభంలోనే మండలంలో వేల హెక్టార్లలో బుడ్డశనగ, ఇతర ప్రధాన పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వర్షాలు పడక రైతులకు నైరాశ్యాన్ని మిగిల్చి వెళ్లిపోయాయి. ఇక రైతుల ఆశలన్నీ రబీపైనే పెట్టుకున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం ఆ ఆశల్ని అడియాశలు చేస్తోంది.

పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపులు

అర్హులైన రైతులకు పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. ఒక్కో రైతుకు రూ.6 వేల వరకు కేంద్రం నుంచి పీఎం కిసాన్ నిధి నుంచి జమకావాల్సి ఉంది. ఈ ఏడాదికి సంబంధించి జూన్ 18న, అక్టోబర్ 5న రెండు విడతలుగా పీఎం కిసాన్ రూ.2 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన సాయం ఇప్పటి వరకు అందకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. పంటలు సాగు చేయాలనుకున్న కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలను వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రబీ సీజన్‌లోనైనా సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాడు రైతులకు అండగా మాజీ సీఎం వైఎస్ జగన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే రైతన్నలకు రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తూ వచ్చింది. కరోనా లాంటి సంక్షోభంలో కూడా ఏటా క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరి నెలల్లో ప్రతి రైతుకు పీఎం కిసాన్‌తో కలిపి రూ.13,500 ప్రకారం ఖాతాల్లో జమ చేశారు. కౌలు రైతులు, దేవదాయ, అటవీ భూమి సాగుదారులకు కేంద్రంతో సంబంధం లేకుండా పూర్తిస్థాయి పెట్టుబడి సాయాన్ని గత ప్రభుత్వం హయాంలో అందించారు. దీనికితోడు వరుణుడు అనుకూలించడంతో రైతుల పంట పండింది.

నేడు చంద్రబాబుతో అన్నదాతకు కన్నీళ్లు

తాము అధికారంలోకి వస్తే ప్రతి సీజన్లో రైతులు పంటలను వేసుకోవడానికి పెట్టుబడి సాయం ఇస్తామని కూటమి నేతలు అబద్ధాల హామీలు పలికారు. అన్నదాతకు సాయం చేయడంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ఎటూ తేల్చడం లేదు. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని గొప్పగా చెబుతూ 'సూపర్ సిక్స్'తో ఎన్నికల ముందు అదరగొట్టిన చంద్రబాబు.. తీరా అధికారం చేపట్టగానే దాని ఊసెత్తడంలేదు. 'అన్నదాత సుఖీభవ' అంటూ పథకం పేరుమార్చి రైతులను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20 వేలు ఎప్పటి నుంచి ఇస్తారు.? ఎన్ని విడతలుగా అందిస్తారు? పీఎం కిసాన్ పథకంతో సంబంధం లేకుండా ఇస్తారా? రూ.6 వేలు పోనూ మిగతా రూ.14 వేలు అందిస్తారా? అనేది కూడా స్పష్టం చేయకుండా అన్నదాతలను మోసం చేస్తున్నారు. సర్కారు నిర్లక్ష్య వైఖరిని రైతులు, రైతుసంఘాల నాయకులు, విపక్షాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి.

ప్రభుత్వ భరోసా ఏది సామీ?



వ్యవసాయానికి ప్రభుత్వం నుంచి భరోసా అవసరం లేదా? గత ప్రభుత్వంలో ప్రతి ఏటా పంట నష్ట పరిహారంగా ప్రతి రైతు ఖాతాకు డబ్బు జమచేసి భరోసా ఇచ్చారు. కానీ ఇప్పుడు ఆ భరోసా లేదు. రైతులపై చిన్నచూపు తగదు. మా బాధలు అర్థం చేసుకుని ప్రభుత్వం సాయం చేయాలి.

– చంద్రహాసరెడ్డి,రైతు, సింహాద్రిపురం

శనగ సబ్సిడీలో కోత తగదు



రబీలో ప్రధానంగా శనగ సాగు చేస్తాం. గత ఏడాది వరకు శనగ విత్తనాలకు 50 శాతం సబ్సిడీ ఉంది. ఈ సారి సబ్సిడీని 25 శాతానికి తగ్గించడం విచారకరం. 25 శాతం కోత విధించడం వల్ల రైతులపైనే భారం పడుతోంది. అధిక వర్షాలు, వర్షాభావం వల్ల ఖరీఫ్ పంటలు ఆశాజనకంగా లేవు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలుపుకోవాలి. 2023 ఖరీఫ్ పంటల బీమా, 2023–24 రబీ కరువు మండలాలకు ఇన్పుట్ సబ్సిడీ విడుదల చేస్తే కాస్తయినా ఉపశమనం కలుగుతుంది.

– వి.రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, సింహాద్రిపురం

క్లుప్తంగా

పరిహారం చెల్లించకుంటే ప్రజా ఉద్యమం

ముద్దనూరు : గండికోట జలాశయం నిర్మాణంలో ముంపునకు గురైన 22 గ్రామాల నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం(ఆర్అండ్ఆర్) ప్రభుత్వం చెల్లించకుంటే ప్రజా ఉద్యమం చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఇతర సభ్యులతో కలసి మండలంలోని కొత్తచౌటిపల్లె, శెట్టివారిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వాసితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ముద్దనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుమారు 20వేల మంది నిర్వాసితులకు ప్యాకేజీ ఇప్పటికీ అందలేదన్నారు. కేవలం 14 గ్రామాలకు మాత్రం నామమాత్రపు ప్యాకేజీ అందిందన్నారు. అర్హులైన నిర్వాసితులకు చట్టబద్ధంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పెండింగ్ ప్యాకేజీ చెల్లించకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామన్నారు. సీపీఎం నాయకులు మనోహర్, శివకుమార్, అన్వేష్, దస్తగిరిరెడ్డి, దాసు, వి.శివకుమార్, విజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలేపల్లెలో పొలం పిలుస్తోంది

పులివెందుల రూరల్ : మండలంలోని పోలేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి, టెక్నికల్ ఏఓ అనిల్‌కుమార్‌రెడ్డిలు కంది పంటను పరిశీలించి మాట్లాడారు. కంది పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు తగిన సూచనలు, సలహాలు రైతులకు అందించారు. అనంతరం శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకోవాలి

కమలాపురం : వ్యవసాయాధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం చిన్నచెప్పలిలో జరిగిన పొలంబడి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. బత్తాయి పంటలో అంతర పంటగా సాగు చేసిన మినుము పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం రైతు సేవా కేంద్రం వద్ద సబ్సిడీ శనగ విత్తనాల ను రైతులకు అందజేశారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, శాస్త్రవేత్త మాధురి, హార్టికల్చర్ అధికారి రెడ్డయ్య పాల్గొన్నారు.

పురుగుమందుల వాడకంలో జాగ్రత్త అవసరం

ముద్దనూరు : పంటలకు పురుగుమందులను అనవసరంగా వినియోగించరాదని వ్యవసాయశాఖ ఏడీ వెంకటసుబ్బయ్య, ఏవో వెంకటకృష్ణారెడ్డిలు సూచించారు. మంగళవారం చెన్నారెడ్డిపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు పలు పంటలను పరిశీలించి మాట్లాడారు. క్రిమి సంహారక మందులను అతిగా వినియోగించరాదని, అవసరం మేరకే ఎరువులను వాడాలని, పంటలకు ఆశించిన పురుగుల నివారణకు అధికారుల సలహాలు పాటించాలని వారు సూచించారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రం

ముద్దనూరు : వరల్డ్ స్పేస్ వీక్ 2024 సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ మంగళవారం ప్రశంసాపత్రాలను అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని వెంకటకిరణ్, కవిత, మేఘన అనే విద్యార్థులు వరల్డ్ స్పేస్ వీక్ అంశంపై వ్యాసరచన పోటీలో మండలస్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి కడపలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో డీఈవో బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేసినట్లు ఉపాధ్యాయుడు భాస్కర్, ఫిజికల్ డైరెక్టర్ మాధవరెడ్డిలుతెలిపారు.

రైతులు సబ్సిడీ శనగలు సద్వినియోగం చేసుకోవాలి

లింగాల : మండలంలోని పెద్దకుడాల రైతు సేవాకేంద్రంలో జరుగుతున్న శనగవిత్తన న మోదు పక్రియను మండల వ్యవసాయ అధికారి రమేష్ పరిశీలించి మాట్లాడారు. మండలానికి 1838 క్వింటాళ్ల శనగలు మంజూరు కాగా ఇప్పటివరకు మండలంలో 645 మంది రైతులు 905 క్వింటాళ్లను నమోదు చేసుకున్నారన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

జమ్మలమడుగు : ఎయిడ్స్‌పై ప్రతివ్యక్తి అవగాహన కలిగి ఉంటే ఆది సంక్రమించకుండా జాగ్రత్తపడుతారని డాక్టర్ షెహనాజ్ తెలిపారు. మంగళవారం చైతన్య ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మీకు తెలుసా అనే పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి సోకిన వారితో కలిసి తిరిగితే రాదన్నారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారితో శారీరకంగా కలిసి నప్పుడు మాత్రమే వారికిసోకుతుందన్నారు.

యాజమాన్య పద్ధతులను పాటించాలి

వేముల : తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యమైన దిగుబడి సాధించాలంటే నూతన సాంకేతిక యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏడీ చెన్నారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని మీదిపెంట్ల గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆయన గ్రామంలో సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. వేరుశనగ పంటలో రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు.

పక్కాగృహాల్లో అవినీతిపై విచారణ జరపాలి

ముద్దనూరు : ముద్దనూరు మేజర్ పంచాయతీ పరిధిలో పక్కాగృహాల నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, సీపీఎం నియోజక వర్గ కార్యదర్శి ఏసుదాసులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పక్కాగృహాల్లో అక్రమాలకు పాల్పడి చేతివాటం ప్రదర్శించి, పాత ఇళ్లకు బిల్లులు చేసి, లబ్ధిదారులనుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ అక్రమాలకు పాల్పడిన హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లపై కలెక్టర్, హౌసింగ్ పీడీలు విచారణ చేపట్టి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

జైభీమ్ మాల మహాసేన కమలాపురం అధ్యక్షుడిగా గంగరాజు



కడప కార్పొరేషన్ : జైభీమ్ మాల మహాసేన కమలాపురం అధ్యక్షుడిగా డి.గంగరాజును నియమిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు పి.సంపత్‌కుమార్ తెలిపారు. కమలాపురం నియోజకవర్గంలో మాలల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి గంగరాజు కృషి చేయాలని కోరారు.

డెంగీ అనుమానిత లక్షణాలు

ముద్దనూరు : స్థానిక 6వ వార్డులో 12 సంవత్సరాల బాలుడికి డెంగీ అనుమానిత లక్షణాలు వున్నట్లు వైద్యాధికారులు మంగళవారం గుర్తించారు. బాలుడికి వున్న లక్షణాలను బట్టి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేసినట్లు, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు రెఫర్ చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కరిష్మా తెలిపారు.

స్వార్థం కోసమే పార్టీ మారిన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కేవలం తమ స్వార్థం కోసమే పార్టీ మారారని, అలాంటి వారు వైఎస్సార్ సీపీని వీడిన ఎలాంటి నష్టంలేదని టౌన్ కన్వీనర్ బాలగంగాధర్‌రెడి, మున్సిపల్ వైస్ చైర్మన్లు మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కమలాపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ మార్పూరి మేరీతో సహా మరో నలుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరడం దారుణం అన్నారు. అలాంటి వారు పార్టీలో ఉన్నా చాలా ప్రమాదకరం అన్నారు. వైఎస్సార్‌సీపీ మంచి నాయకులను తయారు చేస్తుందన్నారు. సాధారణ వ్యక్తులను ఎమ్మెల్యేలు, ఎంపీలను తయారు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మహిళా కౌన్సిలర్లకు వైఎస్సార్ సీపీ పార్టీ టికెట్లు ఇచ్చి అన్ని విధాలా అండగా ఉండి గెలిపిస్తే ఇలా పార్టీ మారడం వారి స్వార్థ రాజకీయాలకు నిదర్శనం అన్నారు. మున్సిపల్ చైర్మన్ మార్పూరి మేరికి తొలిసారి చైర్మన్ పదవి ఇచ్చి ఉన్నత స్థానం కల్పించిన పార్టీకి ద్రోహం చేయడం చాలా విచారకరం అన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు గంగాధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దేవదానం, ఖాజాహుసేన్, ఇతర నాయకులు కొండారెడ్డి, జావీద్, జిలానీ బాషా, గౌస్ మోధీన్, షావలి, జెట్టి నగేష్, సన్నా, భాస్కర్, జగన్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీ, లెప్రసీలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి రవిబాబు

వల్లూరు : ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి రవిబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్పర్శలేని పొడలను గుర్తించడమే కాక అలాంటి పొడలు వున్న వారిని పీహెచ్‌సీకి పంపాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు వున్న గృహాలకు చుట్టు పక్కల రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం వున్న గృహాలను గుర్తించి గళ్ల పరీక్షలకు పంపాలన్నారు. ఆశా కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు, పిల్లల టీకాలు, దంపతుల వివరాలను ఈ ఆశా యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, విరేచనాలు మొదలైన అంటు వ్యాధులు ప్రబల కుండా చర్యలు చేపట్టాలన్నారు. లార్వా సర్వేను నిర్వహించేటప్పుడు తప్పని సరిగా టార్చ్‌లైట్‌ను ఉపయోగించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఫణీంద్ర, సీహెచ్‌వో వేణుగోపాల్, హెల్త్ సూపర్ వైజర్లు సుధాకర్, మమత, మలేరియా విస్తరణ అధికారి మురళి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శిల్పారామ ఏఓ సుధాకర్

పులివెందుల టౌన్ : పులివెందుల శిల్పారామం, వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దసరా సంబరాల సందర్భంగా నిర్వహించే పోస్టర్లను ఆవిష్కరించినట్లు శిల్పారామ ఏఓ బి.సుధాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక శిల్పారామంలో ఆయన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఆకర్షణీయమైన నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. 11వ తేదీన శిల్పారామంలో మదనపల్లెకు చెందిన సూర్య డ్యాన్స్ అకాడమి మాస్టర్ సూర్య ఆధ్వర్యంలో జానపద, సినీ పాటలకు నృత్య ప్రదర్శన, వైఎస్సార్ ఉలిమెల్ల లేక్‌లో పులివెందులకు యువరాజా డ్యాన్సింగ్ స్కూల్ డ్యాన్స్ మాస్టర్ యువకిశోర్ ఆధ్వర్యంలో కోలాటం, జానపద మరియు సినీ పాటలకు నృత్య ప్రదర్శనలు ఉన్నాయన్నారు. 12న పులివెందులకు చెందిన శ్రీరాజాకళా నిలయం డ్యాన్స్ మాస్టర్ బి.రాజా ఆధ్వర్యంలో సినీ, జానపద నృత్యప్రదర్శన, వైఎస్సార్ ఉలిమెల్ల లేక్‌లో విజయవాడ ఎక్సలెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మాస్టర్ చిట్టి నేతృత్వంలో పులివెందుల చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 13న శిల్పారామంలో యువరాజా డ్యాన్సింగ్ స్కూలు మాస్టర్ యువకిశోర్ ఆధ్వర్యంలో పులివెందుల చిన్నారులచే కోలాటం, జానపద, సినీ పాటలకు నృత్య ప్రదర్శన, వైఎస్సార్ ఉలిమెల్ల లేక్‌లో పులివెందులకు చెందిన శ్రీరాజా కళా నిలయం డ్యాన్స్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో పులివెందుల వారిచే సినీ, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పులివెందుల పట్టణ, పరిసర గ్రామీణ ప్రజలు ఈ దసరా సంబరాలలో పెద్దఎత్తున పాల్గొనాలని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సబ్సిడీ శనగ విత్తనాలకు నమోదు చేసుకోండి



లేబాకలో జరిగిన విత్తన నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో సాయిజ్యోతి

వల్లూరు : మండలంలో సబ్సిడీ బుడ్డశనగ విత్తనాల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి సాయిజ్యోతి తెలిపారు. మండల పరిధిలోని లేబాక రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న విత్తన నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలానికి 2393 క్వింటాళ్ల బుడ్డ శనగ విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. క్వింటా పూర్తి ధర రూ.9400 కాగా 25 శాతం సబ్సిడీ రూ.2350 పోనూ రైతు వాటాగా రూ.7050 చెల్లించాల్సి వుంటుందన్నారు. రైతులకు ఎకరాకు రెండు 20 కేజీల బస్తాల చొప్పున గరిష్ఠంగా 5 ఎకరాలకు 10 బస్తాలు ఇస్తారన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు తీసుకుని వెళ్లి బయో మెట్రిక్ ద్వారా విత్తనాల నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లాలిత్య పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లు బీమా చేయించుకోండి

పులివెందుల రూరల్ : నియోజవర్గంలోని ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోస్టల్ ఎల్ఐసీ బీమా చేయించుకోవాలని వైఎస్సార్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు అల్లాబకాస్ తెలిపారు. మంగళవారం పులివెందులలో ఆయన ఫొటోగ్రాఫర్లకు బీమా గురించి వివరించారు. పట్టణంలోని హెడ్‌పోస్ట్ ఆఫీస్ కార్యాలయానికి ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, అవుట్ డోర్ ఫొటో గ్రాఫర్లందరూ వచ్చి తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు. పోస్టల్ ఎల్ఐసీ బీమా కొరకు యూనియన్ తరపున రూ.400లు యూనియన్ చెల్లిస్తుందన్నారు.

దోమ లార్వాలను గుర్తించాలి

పులివెందుల రూరల్ : ప్రతిఇంటిని సందర్శించి ఇంటిలో నీరు నిల్వఉన్న ప్రాంతాలలో టార్చ్‌లైట్‌ను ఉపయోగించి దోమల లార్వాలను గుర్తించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శాంతకుమార్ ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని భాకరాపురం పీహెచ్‌సీలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు నిర్వహించి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటిలోని, ఇంటి వెలుపల ఉన్న నీటితొట్లు, నీటి డ్రమ్ములకు మూతలు ఏర్పాటు చేయించాలన్నారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ దోమ కాటువల్ల మలేరియా, డెంగీ, తదితర ప్రాణాంతక వ్యాధులు వస్తాయని ప్రజలకు తెలియజేయాలన్నారు. వారికి రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు వారు టార్చ్‌లైట్లను పంపిణీ చేశారు.

11న చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఈనెల 11వ తేదీ శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు.

ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు

వేంపల్లె : గర్భిణులు తమ ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ తెలిపారు. మంగళవారం ఆశా డే సందర్భంగా తాళ్లపల్లె పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి గర్భిణీ 12 వారాల్లోనే తమ వివరాల నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అలాగే తగిన సలహాలు సూచనలు నిర్దేశించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నీటి, కీటకాల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం సీహెచ్ఓ ఎస్.మునిరెడ్డి మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల గురించి అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు నిజాముద్దీన్, పృథ్వీ, హెచ్ఈ షఫివున్నిషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థుల సమ్మేళనం



పులివెందుల : అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు



వీరపునాయునిపల్లె : అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం 1996–97 బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. అప్పటి గురువులైన ఉపాధ్యాయులను వారు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పూర్వవిద్యార్థులకు అప్పటి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

వీరపునాయునిపల్లె : స్థానిక సంగమేశ్వర పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సంగమేశ్వర విద్యా సంస్థల అధినేత వెంకటసుబ్బానాయుడు హాజరై మాట్లాడారు. 18 సంవత్సరాల క్రితం పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులను మళ్లీ ఒకచోటకు చేర్చడంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారి వారి కష్ట సుఖాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుబాషిణి, పూర్వపు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• వివిధ అలంకరణలలో అమ్మవారు



సింహాద్రిపురంలో అర్ధనారీశ్వర అలంకారంలో..



పులివెందుల : గజలక్ష్మీదేవిగా అంకాలమ్మతల్లి..



వల్లూరు: అన్నపూర్ణాదేవి అలంకారంలో..



వీఎన్‌పల్లె : శాకాంబరీదేవిగా కీర్తిపల్లె నల్లనమ్మతల్లి



కమలాపురం : ధనలక్ష్మీ అలంకారంలో సుంకులమ్మ



ముద్దనూరు: భవానిదేవి అలంకారములో..